క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జగ్గయ్యపేట అర్బన్ : పేట మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని మంగళవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సోమవారం తెలిపారు. కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో నిర్వహించే ఈ సమావేశానికి సభ్యులంతా హాజరుకావాలని ఆయన కోరారు.

గోశాలకు ఎండుగడ్డి వితరణ



పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ గోశాలకు సోమవారం మండలంలోని అనిగండ్లపాడు గ్రామానికి చెందిన రైతు గింజుపల్లి శ్రీనివాసరావు తన ట్రాక్టర్‌పై 50 వరిగడ్డి కట్టలు తీసుకువచ్చి వితరణగా అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు శ్రీనివాసరావును అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

200 మందికి వైద్యపరీక్షలు



పెనుగంచిప్రోలు:తపాలాశాఖ ఆధ్వర్యంలో స్థానిక పోస్టాఫీసులో సోమవారం విజయవాడ ఎంజే నాయుడు, అమరావతి ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్యశిబిరాన్ని హాస్పిటల్స్ గౌరవాధ్యక్షులు వావిలాల రజనీకాంత్ శర్మ, పోస్టల్‌శాఖ సీనియర్ సూపరింటెండెంట్ నరసింహస్వామి ప్రారంభించారు. వైద్యులు వంశీకృష్ణ, రవితేజ, నాదెండ్ల వేణు, కేతినేని శైలజ పాల్గొని 200 మందికి కీళ్లు, ఎముకల వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

భూముల కౌలు వేలం వాయిదా

భీమవరం(వత్సవాయి):జగ్గయ్యపేట మండలం వేదాద్రి యోగానందా లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానానికి చెందిన 19.32 ఎకరాల వ్యవసాయ భూములకు మండలంలోని భీమవరం గ్రామంలోని శ్రీ రాజగోపాల స్వామి వారి ఆలయ ప్రాంగణంలో సోమవారం బహిరంగవేలం కౌలు వేలంపాటలు నిర్వహించారు. తోట్లవల్లూరు శ్రీవేణుగోపాలస్వామి ఆలయ కార్యనిర్వాహణాధికారి సీహెచ్ హరిదుర్గానాగేశ్వరరావు పర్యవేక్షణలో వేలం నిర్వహించగా, వేలంలో పాల్గొనేందుకు రైతులు ఎవ్వరూ ఆసక్తి చూపలేదు. దీంతో వేలంను రద్దుచేస్తున్నట్లు తెలిపారు. తదుపరి తేదీలను మరలా ప్రకటిస్తామని చెప్పారు. ఆలయ ఈఓ కానూరి సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి సత్రాలకు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ సత్రాల గదులకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల 'తిరుపతమ్మ భక్తులకు వసతి కష్టాలు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో ప్రచురించిన కథనానికి ఆలయ అధికారులు స్పందించారు. సత్రాల గదుల్లో అన్నిరకాల మరమ్మతులు చేపట్టారు. ఐదు గదులను ఏసీ గదులుగా మార్చేందుకు టెండర్లు కూడా పిలిచినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సత్రాల గదులకు మరమ్మతులు చేపట్టంతో పాటు ఏసీ గదులు పెంచటంపై భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కరానికి కృషి చేసిన 'సాక్షి' దినపత్రికకు భక్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

నందిగామ రూరల్:పట్టణంలోని శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారికి విశేష అర్చనలు, నిత్య హోమాది క్రతువులు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ, ఊంజల సేవ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఎదురుకోలోత్సవం, పలురకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణమండపంలో శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు నకిరికంటి విశ్వేశ్వరరావు, గద్దె మధుసూదనరావు, కొప్పు రామారావు, బండారు కేదార్‌నాథ్‌శర్మ, కొంగర దుర్గాప్రసాద్, కొమరగిరి వాచస్పతి తెలిపారు. కల్యాణోత్సవానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరుకావాలని కమిటీ సభ్యులు కోరారు.

నీటి తొట్టెల నిర్వహణ గాలికి

- పట్టించుకోని ఉపాధి హామీ పథకం అధికారులు
- నిరుపయోగంగా మారిన నీటితొట్టెలు
- దాహార్తితో అల్లాడుతున్న పశువులు, జీవాలు
- ఇబ్బందుల్లో పశుపోషకులు



లింగగూడెం రోడ్డులో శిథిలావస్థలో ఉన్న నీటితొట్టె

పెనుగంచిప్రోలు: అసలే ఎండాకాలం...దానికి తోడు ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. మనుషులే నీటి కోసం అల్లాడుతుంటే..మూగజీవాల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. వాగులు. కుంటలు ఎండిపోవడంతో పశువులు, జీవాలు దాహార్తితో అల్లాడుతున్నాయి. పశువులకు దప్పిక తీర్చేందుకు ఉపాధి హామీ పథకం కింద గతంలో గ్రామశివారు, పంటపొలాలకు వెళ్లే దారుల్లో నీటి తొట్టెలు నిర్మించారు. అయితే నిర్వహణ లేకపోవటంతో నేడు అవి నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాలు నీటి కోసం అల్లాడుతున్నాయి.

నిర్వహణ లోపంతోనే...

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పొలాలకు వెళ్లే పశువుల దాహార్తిని తీర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కొన్ని పెనుగంచిప్రోలు మండలంలోని ఆయా గ్రామాల్లో నీటి తొట్టెలు నిర్మించింది.ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున నీరు దొరక్క మూగజీవాలు అల్లాడుతున్నాయి. కొన్నిచోట్ల నీటితొట్టెల ఆనవాళ్లు కూడా కనిపించకపోగా, మరికొన్ని శిథిలావస్థలో ఉండటం గమనార్హం.



సుబ్బాయిగూడెం రోడ్డులో పశువుల కోసం బోరు చుట్టూ నిల్వ చేసిన నీరు

రైతుల అవస్థలు...

మండుతున్న ఎండలకు వాగులు, మునేరు, కుంటలు నీళ్ల లేక ఎండిపోతున్నాయి. మేత కోసం పొలాలకు వెళ్లిన మూగజీవాలకు తాగునీటి కోసం ఇబ్బందులు తప్పటం లేదు. దీంతో రైతులు రోడ్డు పక్కన బోర్లు వద్ద నీటిని నిల్వచేసి పశువుల దాహార్తిని తీరుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టెలను వినియోగంలోకి తేవడంతో పాటు కొత్తతొట్ల నిర్మాణం చేపట్టి వేసవిలో మూగజీవుల దాహార్తిని తీర్చాలని రైతులు కోరుతున్నారు.

పశువులకు ఇబ్బందిగా ఉంది....



గ్రామాల్లో గతంలో నిర్మించిన నీటి తొట్టెలు ఉపయోగంలోకి తీసుకు వచ్చి వేసవిలో పశువుల దాహార్తిని తీర్చాలి. గతంలో నిర్మించినవి నిరుపయోగంగా మారడంతోపాటు కొన్నిచోట్ల కనిపించకుండా ఉన్నాయి. రానురాను నీటి ఎద్దడి మరింత ఉంటుంది. అధికారులు తక్షణమే ఆదిశగా చర్యలు తీసుకోవాలి.

కె ప్రసాద్, రైతు, అనిగండ్లపాడు

కొత్త తొట్లు నిర్మిస్తాం..

పశువుల దాహార్తిని తీర్చేందుకు కొత్తగా నీటి తొట్టెలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఒక్కో తొట్టి నిర్మాణం కోసం రూ.33 వెచ్చించనున్నాం. పెనుగంచిప్రోలు మండలంలోని 14రెవెన్యూ గ్రామాల్లో 14 నీటితొట్లను నిర్మించి పశువులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

జనార్దన్, ఉపాధిహామీ పథకం ఏపీఓ, పెనుగంచిప్రోలు

వేసవి విజ్ఞాన తరగతులు ప్రారంభం



మాట్లాడుతున్న పేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య



మాట్లాడుతున్న సర్పంచి గోనెల దేవి

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 40రోజుల పాటు నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 10వవార్డు కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని సముపార్జించవచ్చన్నారు. గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లిష్, గణితం, తెలుగు దస్తూరి తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పేరం సైదేశ్వరరావు, సంగెపు బుజ్జిబాబు, నాయకులు రామకృష్ణ, సుభాష్, శ్రీనివాసరావు, పుల్లారావు, కవి, ఉపాధ్యాయులు దోసపాటి నాగేశ్వరరావు, టి.వినోద్, టి.ప్రసాద్ బాబు, గ్రంథాలయ సిబ్బంది జె.శ్యామల, సత్యవతి, రాము, బీడీసీలు నాగమల్లిక, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో ..

కొణకంచి(పెనుగంచిప్రోలు): మండలంలోని కొణకంచి శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన తరగతులను సర్పంచ్ గోనెల దేవి సోమవారం ప్రారంభించారు. అనంతరం సర్పంచి దేవి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు మాట్లాడుతూ జూన్ 6 వరకు నిర్వహించే ఈ వేసవి విజ్ఞాన తరగతులకు చిన్నారులకు క్రమంతప్పకుండా పంపించాలని తల్లిదండ్రులను కోరారు. తరగతుల నిర్వహణలో భాగంగా పుస్తకపఠనం, కథలు చెప్పించడంతోపాటు ఆటలు ఆడిస్తామని వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కక్కెర రామారావు, యర్రం భాస్కరరావు పాల్గొన్నారు.

చిన్నారులను సమ్మర్ క్యాంపునకు పంపాలి..

నందిగామటౌన్: వేసవి సెలవుల దృష్ట్యా సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి మస్తాన్‌వలి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మస్తాన్ వలి మాట్లాడుతూ 10వ తరగతి లోపు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, యోగ, కథలు చెప్పడంతో పాటు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మ్యూజికల్ చైర్స్, చెస్, క్యారమ్స్, చిత్రలేఖనం, తదితర ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని తెలిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను ఈక్యాంపునకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యేచూరి రాము, లక్ష్మీనారాయణ, మనబోతుల శ్రీరామ్, వడ్డెల్లి సాంబశివరావు, కామా బాబురావు, పులిపాటి వెంకటేశ్వరరావు, సముద్రాల ఈశ్వరయ్య, నకిరికంటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు వేలం ద్వారా రూ.1.57 లక్షల ఆదాయం

వీరులపాడు: నందలూరులోని భవానీ శంకర స్వామి వారి ఆలయానికి చెందిన 20.26 ఎకరాల భూమికి ఆలయ ఆవరణలో సోమవారం కౌలువేలం నిర్వహించారు. కౌలువేలం ద్వారా ఆలయానికి రూ.1.57 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ నరసింహమూర్తి తెలిపారు. అదేవిధంగా జయంతి గ్రామంలోని రామలింగేశ్వరస్వామి వారి ఆలయానికి చెందిన 15 ఎకరాలకు కౌలు వేలంలో పాల్గొనేందుకు రైతులు ఆసక్తి చూపకపోవడంతో వేలాన్ని వాయిదా వేసినట్లు ఈఓ వివరించారు.

పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు ఏర్పాట్లు

నందిగామ రూరల్: ఈనెల 30వ తేదీ బుధవారం జరగనున్న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు నందిగామ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, పరీక్షల కోఆర్డినేటర్ రమేష్‌బాబు తెలిపారు. స్థానిక కళాశాల ఆవరణలో సోమవారం ఆయన మాట్లాడుతూ పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు నందిగామ పట్టణంలో ఐదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష కొనసాగుతుందన్నారు. పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, డీవీఆర్ కళాశాల, శ్రీవిద్య హైస్కూల్, నారాయణ ఇంగ్లిష్ మీడియం పాఠశాల, కేవీఆర్ కళాశాలల్లోని ఆయా పరీక్ష కేంద్రాల్లో నిర్వహించే ఈ ఎంట్రన్స్ పరీక్షకు 1460 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులు ఉదయం 10 గంటలకల్లా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, వైద్య శిబిరం, తాగునీటి వసతితో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు కోఆర్డినేటర్ రమేష్‌బాబు వివరించారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

నందిగామ రూరల్:పట్టణంలోని శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వర స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారికి విశేష అర్చనలు, నిత్య హోమాది క్రతువులు, సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ, ఊంజల సేవ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం ఎదురుకోలోత్సవం, పలురకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణమండపంలో శ్రీదేవి భూదేవి సహిత వెంకటేశ్వరస్వామి వారి కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు నకిరికంటి విశ్వేశ్వరరావు, గద్దె మధుసూదనరావు, కొప్పు రామారావు, బండారు కేదార్‌నాథ్‌శర్మ, కొంగర దుర్గాప్రసాద్, కొమరగిరి వాచస్పతి తెలిపారు.

సంక్షిప్త వార్తలు

ట్రాక్టర్ బ్యాటరీలు చోరీపై పోలీసులకు ఫిర్యాదు

పెనుగంచిప్రోలు:ట్రాక్టర్‌లో బ్యాటరీలు చోరీకి గురయ్యాయని బాధితులు సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు...చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన పోసాని గురునాథం వ్యవసాయ పనుల అనంతరం ట్రాక్టర్‌ను మండలంలోని కొణకంచి వేబ్రిడ్జి వద్ద నిలుపుతాడు. ఈక్రమంలో ఈనెల 22న రాత్రి వేబ్రిడ్జి వద్ద నిలిపి ఉంచి, మరుసటి రోజు ఉదయం వచ్చి చూడగా తనట్రాక్టర్‌తోపాటు పక్కన పగడాల తండి ట్రాక్టర్‌లోని బ్యాటరీలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయన ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బోర్లకు మరమ్మతులు



కంచికచర్ల : గండేపల్లిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచి బొక్కా రవికుమార్ తెలిపారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలతోపాటు జెడ్పీ పాఠశాలలో పనిచేయని మూడు బోర్లకు సోమవారం మరమ్మతులు చేశారు. ఈసందర్భంగా సర్పంచి మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామస్తులకు తాగునీటిని ఇబ్బందులు లేకుండా బోర్లకు మరమ్మతులు చేపట్టినట్లు వివరించారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణ, పుల్లయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్డీఓకు 19 అర్జీలు అందజేత



నందిగామరూరల్: ప్రజా పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని ఆర్డీఓ కె.బాలకృష్ణ తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించగా, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 19మంది అర్జీలు అందజేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూశాఖకు సంబంధించి ఆరు అర్జీలు, సర్వే చేయాలని కోరుతూ ఐదు, పంచాయతీరాజ్ శాఖకు ఐదు, విద్యుత్ శాఖ ఒకటి, విద్యాశాఖకు ఒకటి, మున్సిపల్‌శాఖకు సంబంధించి ఒక అర్జీ వచ్చినట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులకు పంపించి అర్జీలను పరిష్కరిస్తామని వివరించారు.

వీనుల విందుగా సంకీర్తనా గానం

విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి 258 జయంతి సందర్భంగా శివరామకృష్ణ క్షేత్రంలో సోమవారం నిర్వహించిన జయంతి ఉత్సవాలు, శాస్త్రీయ సంగీత కచేరీ వీనుల విందుగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంగీత విద్వాంసులు యువ సంగీత కళాకారులు త్యాగరాజ స్వామి రచించిన సంకీర్తనలను మధురంగా గానం చేశారు. వేదాంతం పల్లవి, పి. విజయ, పెందుర్తి విజయలక్ష్మి, జి. సూర్యకాంతి, కాళీపట్నపు ఉమ, ఎస్‌సీపీ శాంతిశ్రీ గాత్రంతోనూ.. టి. శర్వాణి బృందం వయోలిన్ సహాయంతో త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. ఇంద్రకీలాద్రి శర్మ, వరణ్ చంద్రన్, శ్రీ కృష్ణ, సూర్య, నేతి శివశంకర్ వాద్యసహకారమందించారు. సద్గురు సంగీత సభ కార్యదర్శి గౌరీనాథ్ మాట్లాడుతూ త్యాగరాజ స్వామి నాదోపాసకుడన్నారు. సంకీర్తనం ద్వారా భగవంతుని చేరుకోవచ్చని లోకానికి తెలియజేసినట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్, హరిప్రసాద్, ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

అబాకస్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

నందిగామ రూరల్: జాతీయ స్థాయి చాంపియన్ షిప్ అబాకస్ వేదిక్ మ్యాథ్స్ పోటీలో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని నందిగామ అబాకస్ సెంటర్ నిర్వాహకులు తుర్లపాడు నాగరాజేశ్వరి, కొమరగిరి వాచస్పతి తెలిపారు. స్థానిక అబాకస్ సెంటర్‌లో సోమవారం ప్రతిభచూపిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజా ఎడ్యుకేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో విజయవాడలోని పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఈనెల 27న జాతీయ స్థాయి అబాకస్ వేదిక్ మ్యాథ్స్ పరీక్ష నిర్వహించగా, తమ సెంటర్ నుంచి హాజరైన 29మంది విద్యార్థుల్లో 12మంది విశేష ప్రతిభను కనబరిచారని తెలిపారు. ఈ పరీక్షకు 14 రాష్ట్రాల నుంచి 1250 మంది విద్యార్థులు హాజరైనట్లు వారు వివరించారు.

రీసర్వే ప్రక్రియ పరిశీలన

వీరులపాడు: మండలంలోని వెల్లంకి గ్రామంలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను తహసీల్దార్ హుస్సేన్ సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. సర్వే సిబ్బంది రైతులకు ఇబ్బందులు లేకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆదేశించారు.

కార్యకర్తలంతా భాగస్వాములు కావాలి

మాజీ ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

నందిగామటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని భాగస్వాములు కావాలని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తకి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. పార్టీకి కష్ట కాలంలో అండగా నిలిచిన వారికి రానున్న జగనన్న 2.0లో ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణంలో ప్రతిఒక్కరు తమ వంతుగా సహకారం అందించాలని కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదవుతున్నా నేటికీ కనీసం ఒక్క హామీ కూడా అమలు చేయలేదని జగన్‌మోహనరావు విమర్శించారు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ మోసపూరిత హామీలిచ్చిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చాక ఆపథకాల అమలుపై నోరు మెదపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలుచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల తరఫున పోరాడుతామని కూటమి ప్రభుతాన్ని హెచ్చరించారు. ఏడాదిగా రాష్ట్రంలో రెడ్‌బుక్ పేరుతో విధ్వంస పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను పూర్తిస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని సూచించారు. పార్టీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, నాయకులు షేక్ మున్నా, తోట అంజారావు, వల్లెపు రవి, పట్టా శ్రీను, గాడిపర్తి రామకృష్ణ, షేక్ జాఫర్, నల్లమల్లి మురళి, మాడుగుల మనోహర్, షేక్ యాకుబ్ అలీ, ముర్వల శ్రీను, వల్లెపు విజయలక్ష్మి, సుభాని, పోతురాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల రద్దుకు డిమాండ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా నాయకులు సోమేశ్వరరావు

పెనుగంచిప్రోలు: కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతం రూ.26వేలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఠా, రవాణా, తదితర కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రప్రభుత్వం కార్మికుల పనిగంటలు పెంచడమంటే శ్రమదోపిడికి పాల్పడే కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలకడమేనన్నారు. అనంతరం సమ్మెకు సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పి.సుజాత, ఎం.జ్యోతి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటరావమ్మ, సీహెచ్ ఎల్లమ్మ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటరత్నం, రమేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి పూర్వ వైభవం తేవాలి : మస్తాన్‌వలి



షేక్ మస్తాన్‌వలిని సన్మానిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: ముస్లింల అభ్యున్నతికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు మాజీముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేషంగా కృషి చేశారని వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి కొనియాడారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన తర్వాత మొదటిసారిగా జగ్గయ్యపేట వచ్చిన మస్తాన్‌వలిని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు ఇచ్చి సహసోపేతమైన నిర్ణయం తీసుకున్న ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ముస్లింలకు ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతోపాటు, ముస్లింలకు హజ్ యాత్రకు వెళ్లేందుకు ఆర్థికసాయం అందజేశారన్నారు. ముస్లింలంతా కలిసికట్టుగా పనిచేసి వైఎస్సార్ సీపీకి పూర్వవైభవం తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కన్నమాల శామ్యూల్, జిల్లా కార్యదర్శి రూప్లానాయక్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రస్ హుస్సేన్, ప్రచారవిభాగం అధ్యక్షుడు బైరబోయిన బాబు, న్యాయవాది పృథ్వీరాజ్, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్ వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఇమ్రాన్‌పాషా, సోషల్ మీడియా అధ్యక్షుడు బుజ్జి సైదాలి, మైనార్టీ నాయకులు ఖాదర్‌బాబు, హుసేన్ షరీఫ్, పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్, కార్మిక, ప్రచార విభాగాల అధ్యక్షులు గంగోలు వినోద్, గోగుల వెంకయ్య, యూత్ ప్రధానకార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, సీనియర్ నాయకుడు బండి రాజు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఘన సత్కారం



అక్షర చిత్రకారుడు ప్రసాద్‌బాబును సత్కరిస్తున్న కళావేదిక ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక ఉక్కు కళావేదికలో సోమవారం రాత్రి శ్రీకళావేదిక ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పలువురు కళాకారులు, విద్యార్థులు తమ ప్రతిభను కనపరిచారు. గాయకులు, కవులు, చిత్రకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్యార్థులు కూచిపూడి, భరత నాట్యాలతో అలరించారు. ఈ సందర్భంగా కవి సరికొండ నరసింహరాజు, ఆధ్యాత్మిక ప్రవచనకర్త రామానుజన్, అక్షర చిత్రకారుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు తూములూరి ప్రసాద్‌బాబులను ఘనంగా సత్కరించారు. జూనియర్ ఘంటసాల సామినేని బాబ్జినాయుడు ఆలపించిన గీతాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో శ్రీకళావేదిక తట్టా రామానుజన్, గౌరవ అధ్యక్షుడు వడ్డెపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి కొండూరు నాగేశ్వరరావు, కోశాధికారి సంగెపు బుజ్జిబాబు, కవులు బత్తుల బ్రహ్మయ్య, అద్దంకి సుధాకర్, నాట్య గురువులు శ్రీలక్ష్మి, నరేష్, నిర్వాహకులు పరసా శ్రీనివాసరావు, వసంత లక్ష్మి పాల్గొన్నారు.